క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామికి నేడు జన్మనక్షత్ర పూజలు

కపిలేశ్వరపురం: అంగరలో వేంచేసిన వేంకటేశ్వరస్వామి జన్మ నక్షత్రం శ్రవణాన్ని పురస్కరించుకుని గురువారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నట్టు ఆలయ నిర్వాహకులు బుధవారం తెలిపారు. తెల్లవారుజామున స్వామివారికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేస్తామన్నారు. స్వామివారి దర్శనానికి వచ్చే భక్తులకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు.

ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవాలి

కె.గంగవరం: రైతులందరూ తప్పని సరిగా ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేయించుకోవాలని రామచంద్రపురం వ్యవసాయ సహాయ సంచాలకులు (ఏడీఏ) ఏఎస్‌వీ రంగారావు అన్నారు. మండలంలోని సత్యవాడ, పాణింగపల్లి గ్రామాల్లో వ్యవసాయంలో తీసుకోవాల్సిన అంశాలపై రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫార్మర్ రిజిస్ట్రీలో పేరు నమోదు చేసుకోవడానికి ఆయా గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాన్ని సంప్రదించాలన్నారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవడం వల్ల భవిష్యత్‌లో అన్ని సంక్షేమ పథకాలకు ఇదే ప్రామాణికంగా ఉంటుందన్నారు. అనంతరం వ్యవసాయంలో మెళకువలు, ఎరువులు, పరుగు మందుల వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఏఓ సత్యప్రసాద్, స్థానిక రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



డ్రైన్లలో దోమల నివారణ మందు పిచికారీ చేస్తున్న పారిశుధ్య కార్మికులు

మండపేట: స్థానిక గొల్లపుంత రోడ్డులోని వైఎస్సార్ కాలనీలో దోమల నివారణకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు పారిశుధ్య కార్మికులతో డ్రైన్లు, వీధుల్లో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కాలనీలో పర్యటించి పనులను పరిశీలించారు. కాలనీలోని అన్ని డ్రైన్లలో దోమల నివారణ మందు పిచికారీ చేయాలని ఆదేశించారు. కాలనీలో దోమల బెడద లేకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది వెంకన్నబాబు, వైఎస్సార్ సీపీ నేతలు పేరూరి మాధవి, కొమ్మోజు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆధార్ శిబిరాలు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు, కోరుమిల్లి, అంగర గ్రామాల్లో బుధవారం ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అంగన్‌వాడీ చిన్నారుల ఆధార్ కార్డుల్లో వివరాలను నవీకరించే లక్ష్యంతో ఈ శిబిరాలు ఏర్పాటు చేశారు. ఈ శిబిరాల్లో చిన్నారుల ఆధార్ వివరాలను డిజిటల్ అసిస్టెంట్లు ఇనుమర్తి వీరమల్లేశ్వరరావు, అల్లక ఫణీంద్ర, కోరా దొరబాబు నవీకరణ చేశారు. గురువారం కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వల్లూరు గ్రామాల్లో శిబిరాలను నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ రత్నకుమారి తెలిపారు.

భీమేశ్వరుని దర్శించుకున్న ఇండియన్ కోస్ట్ గార్డ్స్



ద్రాక్షారామలో భీమేశ్వరుని దర్శించుకుని వెళుతున్న ఇండియన్ కోస్ట్ గార్డులు

రామచంద్రపురం రూరల్: ఇండియన్ కోస్ట్ గార్డ్స్ 49 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వినూత్న కార్యక్రమం చేపట్టారు. దీనిలో భాగంగా 49 బైక్‌లతో విశాఖపట్నం నుంచి చెన్నై వరకు బైక్‌లతో ర్యాలీ చేస్తూ మార్గమధ్యంలో సముద్రంలో వేటపై ఆధారపడి జీవించే జాలర్లకు వేటాడే సమయంలో వచ్చే ప్రమాదాలను పసిగట్టడం, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరిస్తూ వారిలో అవగాహన కల్పిస్తూ సాగుతున్న యాత్రలో బుధవారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఫుల్ బ్లాక్ సూట్‌లో ప్రత్యేక వస్త్రధారణతో బైక్‌లపై ర్యాలీగా వస్తున్న వారిని ప్రధాన రహదారి వెంబడి ప్రయాణికులు తమ ప్రయాణం ఆపి మరీ ఆసక్తిగా చూశారు.

మాజీ సర్పంచ్ గోవిందరాజు మృతి

ఆలమూరు: మండలంలోని పినపళ్లకు చెందిన గ్రామ మాజీ సర్పంచ్ అన్నందేవుల గోవిందరాజు (90) మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన వయోభారం దృష్ట్యా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆరోగ్యం మరింతగా క్షీణించడంతో బుధవారం తెల్లవారుజామున ఆయన నివాసంలోనే మృతి చెందారు. సర్పంచ్‌గా 15 ఏళ్లు పనిచేసి గ్రామాభివృద్ధికి ఆయన విశేష కృషి చేశారు. ఆయన భార్య నాలుగేళ్ల క్రితం మృతి చెందారు. నలుగురు కుమార్తెలు ఉన్నారు.

మహా కుంభమేళాకు మనమూ వెళ్దామా..

- రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు
- వివిధ క్షేత్రాల సందర్శనార్థం ఏర్పాట్లు



కుంభమేళా యాత్రకు సిద్ధం చేసిన ప్రత్యేక బస్సులు

రామచంద్రపురం రూరల్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లేందుకు రామచంద్రపురం ఆర్టీసీ డిపో నుంచి భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక సర్వీసులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పేపకాయల భాస్కరరావు తెలిపారు. రామచంద్రపురం డిపో నుంచి కుంభమేళా, అయోధ్యలను దర్శించుకునే విధంగా పలు పుణ్యక్షేత్రాలను కలుపుతూ కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

యాత్ర సాగేదిలా..

8 రోజుల పాటు: ఫిబ్రవరి 12న మధ్యాహ్నం 2 గంటలకు రామచంద్రపురం డిపో నుంచి బయలుదేరి 8 రోజుల్లో భువనేశ్వర్, పూరి, కోణార్క్, ప్రయాగ్‌రాజ్, కుంభమేళా, వారణాసి, అయోధ్య, గయ, బుద్ధగయ, అరసవిల్లి, శ్రీకూర్మం, త్రివేణి సంగమం స్నానం, విశ్వనాథ దర్శనం, గయ పిండ ప్రదానం ప్రాంతాలను సందర్శించడం జరుగుంది. 8 రోజుల యాత్రకు రూ.10,800 టికెట్ ధరగా నిర్ణయించారు. 7 రోజుల పాటు: అయోధ్య మినహాయించి పై ప్రదేశాలన్నింటి 7 రోజుల పాటు దర్శింపజేస్తారు. దీనికి రూ.10,000 టికెట్ ధర నిర్ణయించారు.

ప్రత్యేక యాప్..

ఆర్టీసీ బస్సుల్లో యాత్రకు వెళ్లే భక్తుల కోసం ప్రత్యేక యాప్ రూపొందించారు. ప్రయాణంలో భాగంగా వివిధ యాత్రా స్థలాల్లో బస్సు దిగి వెళ్లినవారు తిరిగి బస్సు దగ్గరకు చేరుకోవడానికి సులువుగా ఈ యాప్ దారి చూపిస్తుంది. ఈ యాప్‌ను ప్రతి ఒక్కరి సెల్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేయడం జరుగుతుంది.

సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు..
99489 39888,
73829 10769,
79979 08887
ఆర్టీసీ ఎంక్వయిరీ: 73829 25520

భక్తులు సద్వినియోగం చేసుకోవాలి



భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక సర్వీసులను భక్తులు సద్వినియోగం చేసుకోవాలి. 7 రోజుల యాత్ర అయినా, 8 రోజుల యాత్ర అయినా ప్రయాగ్‌రాజ్, కాశీ క్షేత్రాల్లో ఒక రోజు బస ఉంటుంది. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేస్తాం. 2 ప్లస్ 2 పుష్ బ్యాక్ విశాలమైన సీట్లతో కూడిన సరికొత్త సూపర్ లగ్జరీ వీడియో కోచ్ బస్సుల్లో ప్రయాణం సురక్షితంగా, సౌకర్యవంతంగా ఉంటుంది.

– పేపకాయల భాస్కరరావు,
డిపో మేనేజర్, రామచంద్రపురం డిపో

పశువుల సంరక్షణపై అవగాహన అవసరం



నేలటూరులో పాడి రైతుకు మందులు అందజేస్తున్న అనిత

కపిలేశ్వరపురం: పశువుల సంరక్షణపై పాడి రైతులకు అవగాహన అవసరమని పశుసంవర్ధక శాఖ ఆలమూరు సహాయ సంచాలకులు ఎల్.అనిత అన్నారు. మండలంలోని నేలటూరులో బుధవారం నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరాన్ని ఆమె సందర్శించారు. వైద్యాధికారి వీవీ రమణమూర్తి 88 పాడి గేదెలు, ఆవులకు చికిత్స చేసి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రుద్రాక్షుల వీరగౌరీ కుమారి, స్థానిక నాయకుడు వల్లూరి శ్రీనివాస్ చౌదరి, పశు సంవర్ధక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్‌ధారణపై అవగాహన ర్యాలీ



రామచంద్రపురం ప్రధాన రహదారిపై పోలీసుల అవగాహన ర్యాలీ

మండపేట: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ సూచించారు. డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో హెల్మెట్‌ధారణపై అవగాహన కల్పించడంతో పాటు ప్రమాదాల నివారణకు రహదారి భద్రతా నియమాలు పాటించాలని కోరుతూ బుధవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. డివిజన్ పరిధిలోని పోలీసులు హెల్మెట్లు ధరించి ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక కలువపువ్వు సెంటర్లో డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డివిజన్ పరిధిలో రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రయాణాలు చేసే ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించపోతే రూ.1000 జరిమానా విధిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిలో 80 శాతం మంది హెల్మెట్ లేకపోవడం వల్లే మృత్యువాత పడుతున్నారని తెలిపారు. ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలని సూచించారు. మద్యం తాగి డ్రైవింగ్ చేసినా, రహదారి భద్రతా నిబంధనలు ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో రూరల్, టౌన్ సీఐలు పి.దొర రాజు, దారం సురేష్, ఎస్‌ఐలు హరికోటి శాస్త్రి, బుజ్జిబాబు, డి.సురేష్, రామచంద్రపురం, అంగర, రాయవరం ఎస్‌ఐలు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు పాల్గొన్నారు.

హెల్మెట్ అవగాహన ర్యాలీ

రామచంద్రపురం: రామచంద్రపురం డీఎస్పీ రఘువీర్ ఆధ్వర్యంలో బుధవారం రామచంద్రపురం పట్టణం నుంచి మండపేట వరకు హెల్మెట్ ధరించడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ బైక్ ర్యాలీ నిర్వహించారు. రెండు పట్టణాల పరిధిలోని ప్రధాన కూడళ్లలో ఆగి ప్రయాణికులకు హెల్మెట్ ధరించడం వల్ల ప్రయోజాలను వివరించారు. కార్యక్రమంలో సీఐలు వెంకటరమణ, దొరరాజు, ఎస్సైలు నాగేశ్వరరావు, లక్ష్మణ్, జానీబాషా, సురేష్ బాబు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వెల్లలో పొలం పిలుస్తోంది



వెల్లలో ఉత్తమ సేవా పురస్కార గ్రహీతలను సత్కరించిన ప్రజాప్రతినిధులు, అధికారులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల రైతు సేవా కేంద్రం వద్ద బుధవారం మండల వ్యవసాయ అధికారి ఎస్.సత్యప్రసాద్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ ఏఎస్‌వీ రంగారావు పాల్గొని మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల ద్వారా ఎరువులు సరఫరా చేస్తున్నామన్నారు. ఎన్‌పీఎస్ఎస్ యాప్ ఉపయోగాల గురించి రైతులకు వివరించారు. ఏఓ సత్యప్రసాద్ మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు 1800 ఎకరాల పంటను ఈ-క్రాప్ నమోదు చేయడం జరిగిందన్నారు. మిగిలిన రైతులు ఫిబ్రవరి 15 లోపుగా నమోదు చేయించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జనవరి 26 రిపబ్లిక్ డే సందర్భంగా ఉత్తమ సేవా అవార్డును జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్న గ్రామ వ్యవసాయ సహాయకుడు పి.సత్యనారాయణ, వీఆర్ఏ వి.రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ సీహెచ్ వెంకటరమణలను రైతుల సమక్షంలో సర్పంచ్ వీరబోయిన సూరిబాబు చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వలివేటి సూర్య సుబ్రహ్మణ్యం, సచివాలయ సిబ్బంది, అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

అధ్వానంగా డ్రైనేజీలు



గొల్లపాలెంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీ

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో అధ్వానంగా ఉన్న డ్రైనేజీలను మెరుగుపర్చేందుకు పంచాయతీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధానంగా గ్రామంలోని ఎస్సీ కాలనీలైన ధనలక్ష్మీపేట, అరుంధతీపేటలలో డ్రైనేజీలు దుర్భరంగా ఉన్నాయి. గ్రామంలోని డ్రైనేజీల్లోని మురుగునీరంతా ఈ కాలనీ మీదుగానే కూరాడ డ్రైన్‌లోకి చేరుతుంది. అధికారులు డ్రైనేజీలు మెరుగుపరచకపోవటంతో మురుగునీరు ముందుకు పారక దుర్గంధాన్ని భరించలేకపోతున్నామని తాము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పటించుకోవడం లేదని పాలక వర్గ సభ్యులు పెంటపాటి శ్రీను, రేఖపల్లి సత్యనందం తదితరులు వాపోతున్నారు. డ్రైనేజీల కారణంగా దోమల ఉధృతి పెరిగి స్థానికులు అనారోగ్యాల పాలవుతున్నారన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన



మహిళా చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

రాయవరం: మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అనపర్తి మేజిస్ట్రేట్ కోర్టు న్యాయవాదులు సూచించారు. మండల స్త్రీశక్తి భవనంలో జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు చట్టాలపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు టీవీవీ రమణమూర్తి, పి.వీరబాబు మాట్లాడుతూ మహిళలకు కేంద్రం అమలు చేస్తున్న చట్టాలపై అవగాహన కల్పించారు. 2024 జూలైలో కేంద్ర ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన చట్టాలను వివరించారు. గృహహింస, ఈవ్‌టీజింగ్, వరకట్న వేధింపులు తదితర సమస్యలకు 15100 హెల్ప్‌లైన్, సైబర్ నేరాల నియంత్రణకు 1930 టోల్ ఫ్రీ నంబర్లను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సమస్యలపై పోలీస్‌స్టేషన్లో సంప్రదించే అంశాలపై హెచ్‌సీ పి.వెంకటేశ్వరరావు మహిళా సంఘాల సభ్యులకు అవగాహన కల్పించారు. సమావేశంలో కొత్తపల్లి శ్రీదేవి, వీవోఏలు పాల్గొన్నారు.

అతి వినియోగం అనర్థమే..

కాజులూరు: పంటలపై సోకు తెగుళ్లు, పురుగుల ఉధృతిని బట్టే రైతులు ఎరువులు, పురుగుమందులు వినియోగించాలని అవసరాన్ని మించి మందులు వాడకం అనర్థాలకు దారితీస్తుందని మండల వ్యవసాయాధికారి వి.అశోక్ అన్నారు. జగన్నాథగిరిలో వ్యవసాయశాఖ సిబ్బంది నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పంటలపై రైతులు అవసరాన్ని మించి మందులు వాడుతున్నారని రెండు, మూడు రకాల మందులను కలిపి వాడుతుండటంతో ఏ మందు పనిచేయకక వృథావ్యయాలు అవుతున్నాయన్నారు. ఫలితంగా ఖర్చు పెరిగి రైతులు నికర ఆదాయం తగ్గుతుందని మిత్ర పరుగులు చనిపోయి పంటకు మరింత హానీ కలుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడులతో అధిక ఆదాయాలు సమకూర్చుకునే విధానాలను రైతులకు వివరించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, స్థానిక రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ పునః ప్రతిష్ఠ పూజలు



భావనారుషి ఆలయంలో విగ్రహాల పునఃప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న వేదపండితులు

రాయవరం: గ్రామంలోని భద్రావతి సమేత భావనారుషి, గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి నూతన ఆలయంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపన పూజలను బుధవారం ప్రారంభించారు. స్థానిక గోపరితోటలోని భద్రావతి సమేత భావనారుషి ఆలయం శిథిలావస్థకు చేరుకోవడంతో దాతల సహకారంతో నూతన ఆలయాన్ని నిర్మించారు. ఈ ఆలయంలో భద్రావతి సమేత భావనారుషి విగ్రహాలతో పాటు గణపతి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి విగ్రహాలను శుక్రవారం ప్రతిష్ఠించనున్నారు. దీనిలో భాగంగా పునఃప్రతిష్ఠ పూజలు చేపట్టారు. పెదపూడి రఘురామ్ అర్చకత్వంలో 12 మంది దంపతులు పునఃప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్నారు. స్వామివారికి విశ్వక్షేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విక్‌వరుణం, యాగశాల ప్రవేశం, వాస్తుపూజ, వాస్తు హోమం, మృత్యంగ్రహణం, అంకురారోహణం తదితర పూజలు నిర్వహించారు. ఈ నెల 31న ఉదయం 8.30 గంటలకు స్వామివార్ల విగ్రహాలు ప్రతిష్ఠించనున్నట్టు తెలిపారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

అంగన్‌వాడీలను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలి



సంతకాలు, దరఖాస్తును ప్రదర్శిస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

రాయవరం: అంగన్‌వాడీ కార్యకర్తలను శాశ్వత ఉద్యోగులుగా పరిగణించాలని ఐసీడీఎస్ మండపేట ప్రాజెక్టు వర్కింగ్ కమిటీ అధ్యక్షురాలు దొమ్మేటి ఆదిలక్ష్మి డిమాండ్ చేశారు. మండలంలోని సోమేశ్వరంలో బుధవారం మాచవరం సెక్టార్ పరిధిలోని అంగన్‌వాడీ వర్కర్ల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలన్నారు. రాష్ట్రపతికి తమ ఆవేదనను సంతకాల రూపంలో పంపుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలంతా రాష్ట్రపతికి వినతి పంపాలన్నారు. ఈ మేరకు కార్యకర్తలు సేకరించిన సంతకాలు, దరఖాస్తును ఆమె ప్రదర్శించారు. కార్యక్రమంలో సీహెచ్.సత్యవేణి, మాచవరం సెక్టార్ లీడర్ ఎం.కమల తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు పిలుపు ఈ మలుపు



దొరగారిమకాం సెంటర్‌లో ప్రమాదభరితంగా ఉన్న 'జెడ్' మలుపు

కాజులూరు: కాకినాడ-కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం ఆర్యావటం వద్ద ఉన్న మలుపులు ప్రమాదాలకు నిలయంగా మారాయి. ముఖ్యంగా దొరగారి మకాం సెంటర్‌లో ఉన్న 'జెడ్' ఆకారంలో ఉన్న మలుపులో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. వేగంగా వచ్చువాహనాలు దగ్గరికి వచ్చేవరకు ఒకదానికి ఒకటి కనిపించక పోవడంతో ఢీకొని ప్రయాణికులు ప్రమాదాల పాలవుతున్నారు. ఈ మలుపులకు ఇరువైపులా స్పీడ్ బ్రేకర్లుకాని, హెచ్చరిక బోర్డులు కాని లేకపోవడంతో ప్రమాదాలు మరింత ఎక్కువతున్నాయని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

ఫొటోగ్రాఫర్‌కి ఆర్థికసాయం



వెంకటాయపాలెంలో బాధిత ఫొటోగ్రాఫర్‌కి సాయం అందజేస్తున్న అసోసియేషన్ నాయకులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెంకటాయపాలెంకు చెందిన ఫొటోగ్రాఫర్ లంక విజయ్‌కుమార్‌కి గుండెకు నీరు పట్టి అనారోగ్యం పాలయ్యాడు. ది రామచంద్రపురం ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో సభ్యుడైన విజయ్‌కి అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం రూ.25 వేల ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రామచంద్రపురం జోన్ అధ్యక్షుడు గాధం మధు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ మద్దిరెడ్డి వరప్రసాద్(నాని), జిల్లా ఉపాధ్యక్షుడు ఉద్దగిరి బాలకృష్ణ, సీనియర్ సభ్యుడు ఎస్ఆర్‌కే పవన్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఎం కృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్



గౌరవ డాక్టరేట్ అందుకున్న కృష్ణారెడ్డి

రావులపాలెం: మండలంలోని ఈతకోట జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కేఎస్‌వీ కృష్ణారెడ్డికి గౌరవ డాక్టరేట్ లభించినట్టు బుధవారం ఆయన తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన మనం ఫౌండేషన్ సంస్థ కృష్ణారెడ్డి విద్యాశాఖకు అందించిన అత్యుత్తమ సేవలకు గాను గౌరవ డాక్టరేట్‌తో పాటు భారత్ సేవా రత్న నేషనల్ అవార్డు 2025 అందించిందన్నారు. 76వ గణతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఇటీవల హైదరాబాదులోని త్యాగరాయ గానసభలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును మనం ట్రస్ట్ అధినేత కె. చక్రవర్తి, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, తెలంగాణలో పనిచేస్తున్న ఐపీఎస్ అధికారి కవి, రచయిత, ఎలమంచిలి వెంకటరమణ, డిప్యూటీ కలెక్టర్ ఎస్‌వీవీ సత్యనారాయణ తదితరులు కృష్ణారెడ్డికి దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి పురస్కారాన్ని అందజేసినట్టు తెలిపారు.

● భూమికీ పచ్చాని రంగేసినట్టు..



పచ్చదనంతో ఆకట్టుకుంటున్న పంట పొలాలు

కె.గంగవరం: పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు అనే నానుడికి రామచంద్రపురం నియోజకవర్గమే నిదర్శనం. అటు జీవనశైలిలోను ఇటు పల్లె అందాల్లోను పట్టణవాసులకు కనువిందు చేస్తుంది. మానవుని జీవన గమనంలో దాదాపు సుదీర్ఘ కాలం పాటు వెన్నెంటి వచ్చేది పల్లెలు మాత్రమే. ప్రస్తుతం పల్లె వాతావరణం పుడమితల్లికి పచ్చబొట్టు వేసినట్టు కనువిందు చేస్తుంది. ప్రస్తుతం వ్యవసాయ పనులు ప్రారంభమై నెల దాటుతున్న తరుణంలో నల్లగా కనిపించే భూమి మొత్తం పచ్చరంగుతో నిండి ఆహ్లాదాన్ని అందిస్తుంది. ఒకపైపు మంచుతో కొబ్బరి, తాడి చెట్ల మధ్య పల్లె వాతావరణం ఊటీని తలపిస్తుంది.

స్టడీ మెటీరియల్ అందజేత

మండపేట: పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని విశాఖపట్టణానికి చెందిన మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు పడగల శ్రీనివాస్ పేర్కొన్నారు. మండంలోని ద్వారపూడి కాశీ విశ్వనాథరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు బుధవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. మహాత్మాగాంధీ క్లాత్ మార్కెట్ భవనంలో ద్వారపూడి శాఖ చైర్మన్ పల్లాబాబు ఆధ్వర్యంలో విద్యార్థులకు మెటీరియల్ అందజేశారు. పాఠశాలల హెచ్‌ఎం బి.జ్యోతి, సుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయుడు గండి స్వామి ప్రసాద్, సంస్థ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ పాల్గొన్నారు.



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందిస్తున్న మానవతా సంస్థ ప్రతినిధులు

రోడ్డుపై గుంత.. ప్రయాణికులకు వెత



అంగర థియేటర్ సెంటర్ మలుపులో రోడ్డుకు పడిన గుంత

కపిలేశ్వరపురం: అంగర థియేటర్ సెంటర్‌లోని ఆర్ అండ్ బీ రహదారి మలుపులో రోడ్డుకు పడిన గుంత ప్రమాదకరంగా మారింది. స్థానిక కాటన్ విగ్రహం వద్ద రహదారిపై గుంత ఏర్పడటంతో ద్విచక్ర వాహనదారులు తరచూ జారి పడుతున్నారు. గుంత ఉన్న మలుపు ఎదురుగా ఊరచెరువు ఉండటంతో అదుపు తప్పినవారు చెరువులో పడే ప్రమాదం ఉంది. మలుపు వద్ద చర్చి, రెండు థియేటర్లు, అశిరాంబ అమ్మవారి ఆలయాలు ఉండటంతో రాకపోకలు రద్దీగా ఉంటాయి. నియోజకవర్గ కేంద్రం మండపేట కు వెళ్లే వాహనాలు ఈ మలుపు మీదుగానే వెళ్తుంటాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నారు.